క్లుప్తంగా

పెద్దమ్మ ఆలయాభివృద్ధికి విరాళం



నగదు అందజేస్తున్న దాత దుగ్గిరెడ్డి రామాంజనేయరెడ్డి

బనగానపల్లెరూరల్: మండలంలోని టంగుటూరులో వెలసిన శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి శనివారం సంజామల మండలం అక్కంపల్లి గ్రామానికి చెందిన దంపతులు దుగ్గిరెడ్డి రామాంజనేయరెడ్డి, ఆనందమ్మ రూ. లక్ష విరాళంగా అందజేశారు. దాతలకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

రేపటి నుంచి తిమ్మనాయినపేటలో గడప గడపకు మన ప్రభుత్వం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని తిమ్మనాయినపేటలో 8,9 తేదీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బరాజు శనివారం తెలిపారు. రెండు రోజులు నిర్వహించే ఈ కార్యక్రమం మధ్యాహ్నం 3గంటల నుంచి ప్రారంభమవుతుందని, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరవుతారని చెప్పారు. మండల స్థాయి అధికారులతో పాటు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పక హాజరు కావాలని సూచించారు.

13న మెగా లోక్ అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ప్రియతం రెడ్డి

బేతంచెర్ల: డోన్‌లో ఈనెల 13న జరిగే మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని, ఇరువర్గాలు కేసులను పరిష్కారించుకునేందుకు హాజరయ్యేలా పోలీసులు చూడాలని సీఐ ప్రియతం రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌ల్లో ఎస్ఐ శివ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు, గ్రామ సచివాలయ మహిళా పోలీసులతో సీఐ సమావేశం నిర్వహించారు. పట్టణంతో పాటు, గ్రామలవారీగా నమోదైన కేసులపై చర్చించారు. ఇరువర్గాలు స్నేహపూర్వక వాతావరణంలో రాజీ అయ్యే కేసులకు సంబంధించి బాధితులు హాజరేయ్యేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు లింగమయ్య,కలిముల్లా, హెడ్ కానిస్టేబుల్ చంద్ర శేఖర్, చంద్ర శేఖరప్ప, బాలజీ సింగ్, పోలీసులు తిరుమలయ్య, నాగరాజు,గురుబాబు,దస్తగిరి,శ్రీకాంత్ పాల్గొన్నారు.

మహమ్మద్ ప్రవక్త బోధనలను అనుసరించాలి



ఇస్తెమా ప్రాముఖ్యతను వివరిస్తున్న మత పెద్దలు

కోవెలకుంట్ల: ముస్లిం సోదరులు మహమ్మద్ ప్రవక్త బోధనలను అనుసరించాలని హైదరాబాదు, కర్నూలు, నంద్యాలకు చెందిన మత పెద్దలు జాఫర్ ఉసేన్, అబ్దుల్ రహిమాన్, సలీం, దావుద్‌ఖాన్ పేర్కొన్నారు.శనివారం స్థానిక ముదిగోడు చౌరస్తాలోని షాదీఖానా ఆవరణలో నియోజకవర్గస్థాయి ఇస్తెమా నిర్వహించారు. కోవెలకుంట్ల, బనగానపల్లె, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల మండలాలకు చెందిన సుమారు 1500 మంది ముస్లిం సోదరులు ఇస్తెమాలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఖురాన్ ప్రాముఖ్యత, ముస్లింలు అచరించాల్సిన పద్ధతులను మత పెద్దలు వివరించారు. పట్టణానికి మత పెద్దలు యాసిన్, కలాం, ముజాయిత్ పాల్గొన్నారు.

అక్రమ ఇంటి నిర్మాణంపై కమిషనర్‌కు ఫిర్యాదు

డోన్ టౌన్: ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతున్న ఓ వ్యక్తిపై చిగురమానుపేటకు చెందిన రంగస్వామి, సత్యనారాయణ, ఈశ్వరయ్య, రజాక్, కాశమ్మ తదితరులు మున్సిపల్ కమిషనర్ వెంకటేశులుకు ఫిర్యాదు చేశారు. మురుగుకాలువ, మంచినీటి పైపు లైన్లను ఆక్రమించి అక్కడే ఉన్న ఈశ్వరుని గుడికి రాకపోకల కు ఇబ్బందికరంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నాడని వారు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. విచారణ చేసి అక్రమ కట్టడాన్ని తొలగిస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు కాలనీవాసులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అన్నమయ్య జయంతి

నంద్యాల(వ్యవసాయం): స్థానిక సంజీవనగర్ రామాలయంలో వెలసిన అన్నమయ్య జయంతి వేడుకలను శ్రీ భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామునే పంచామృతాభిషేకం, విశేష పూజలు, అర్చనలు చేశారు. సంజీవనగర్ శ్రీనివాసనగర్ పురవీధుల్లో అన్నమయ్య సంకీర్తనలు పాడుతూ నగర సంకీర్తన చేపట్టారు. అనంతరం శ్రీ వేంకటేశ్వర ఆలయంలో శ్రీభక్తాంజనేయ భజన మండలి వారు అన్నమయ్య సంకీర్తన కార్యక్రమం జరిపించారు.

సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు'

- ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు
- అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ ఫలాలు
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

అవుకు: ప్రజా సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించేందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ప్రజలను నేరుగా కలుసుకుని సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు మీ ముందుకు వచ్చామని, ఇలాంటి కార్యక్రమం ఇంత వరకు ఏ సీఎం చేపట్టలేదని గుర్తు చేశారు. అవుకు మండలం కునుకుంట్ల గ్రామంలో శనివారం సాయంత్రం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, అధికారులతో కలిసి గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రతిఒక్కరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ ముందుకు సాగారు. అవ్వా పింఛన్ సరైన సమయానికి అందుతుందా.. అమ్మ మీ ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. అక్కా వైఎస్సార్ చేయూత వస్తుందా .. మీ పిల్లలకు అమ్మఒడి పడుతుందా.. మీకు ఇంటి పట్టా వచ్చిందా.. తదితర విషయాలపై ఆరా తీస్తూ ఎమ్మెల్యే ముందుకు సాగారు. కొంతమందికి చిన్న చిన్న కారణాల వల్ల సంక్షేమ పథకాలునిలిచిపోవటంతో మండల స్థాయి అధికారులను, సచివాలయ ఉద్యోగులను బాధితుడి దగ్గరకు పిలిచి అక్కడికక్కడే ఎమ్మెల్యే సమస్యలను పరిష్కరించారు. అర్హత మేరకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బ్రోచర్‌లను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలో ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకుని సంక్షేమ పాలన సాగిస్తున్నారన్నారు. ఏ చిన్న పొరపాటుతో కూడా పేదలు సంక్షేమ పథకాలకు దూరం కాకూడదనేది సీఎం ఉద్దేశమని, ఈ మేరకు తాము మీ ముందుకు వచ్చామన్నారు. ప్రజా ప్రతినిధులు ప్రతి గడపకు తిరిగి అక్కడి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని తక్షణమే పరిష్కార మార్గాలు చూపటానికి వీలువతున్నాయన్నారు.పార్టీలు, కుల, మత, వర్గ, తేడాలు లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రతి కుటుంబానికి సీఎం ప్రభుత్వ ఫలాలు అందజేశారని, సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోమారు వైఎస్సార్‌సీపీని ఆశీర్వాదించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని ప్రజలను కోరారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోండి

కునుకుంట్ల గ్రామంలో అంతర్గత రోడ్ల నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆదేశించారు. గ్రామంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే ఆయా కాలనీల ప్రజలు సమస్యలను విన్నవించారు. వర్షం వస్తే రోడ్లు జల మయం అవుతున్నాయన్నారు. గ్రామంలోని నూతన సచివాలయం నుంచి 100 మీటర్లు, కురుమయ్య ఇంటి నుంచి వెంకప్పగారి రాముడు ఇంటి వరకు 100 మీటర్లు, ఎస్సీ కాలనీలో 20 మీటర్లు, పాత సచివాలయం నుంచి చెన్నుస్వామి ఆలయం వరకు 100 మీటర్లు, మారెమ్మ ఆలయం నుంచి రమేష్ ఇంటి వరకు 30 మీటర్లు సీసీ రోడ్లు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్ రెడ్డి, ఎంపీడీఓ అజాంఖాన్, డిప్యూటీ తహసీల్దార్ పోతు ప్రసాద్ బాబు, ఏఓ ప్రసాద్ రావు, డాక్టర్ భారతీదేవి, ఏఈఓలు పక్కీరయ్య, క్రిష్ణమూర్తి, కరిముల్లా, ఏపీఎం విజయగోపాల్, ఏపీఓ అనీఫా, కునుకుంట్ల ఎంపీటీసీ సభ్యురాలు ప్రత్యూష, అవుకు మండల సచివాలయ కన్వీనర్ తల్లం సుబ్రహ్మణ్యం, ఎంపీఓ రవి, వైఎస్సార్‌సీపీ నాయకులు పురుషోత్తం నాయుడు, లక్మానాయక్, రాముడు నాయక్, కంబగిరిరాముడు నాయక్, గంగారి రామయ్య, వెంకప్పగారి రాముడు, క్రిష్ణయ్య, కొత్తరాయుడు, కంబగిరి రాముడు, వెంకటయ్య, పి. రాముడు, మధు, శివ, కంబగిరి, మనోహర్, పక్కీర, గుల్లెన్న, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

11 నుంచి బాలల సంస్కార శిక్షణా తరగతులు

బనగానపల్లెరూరల్: పట్టణంలోని రవ్వలకొండపై ఉన్న శ్రీహట్టిమునిస్వామి ఆశ్రమంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 26వ తేదీ వరకు బాలల సంస్కార శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్ సంఘటనా కార్యదర్శి దొంతా వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. బాలబాలికల్లో దేశభక్తి, దైవభక్తి భావం కలిగి భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా రాణించేందుకు నైతిక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు శిక్షణా తరగతులు ఉంటాయని, ఆసక్తి కలిగిన వారు 944026 28299 నంబరుకు సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఉపాధి కూలీలకు పనిముట్లు ఇవ్వాలి

బేతంచెర్ల: ఉపాధి హామీ పథకం పనులకు హాజరయ్యే కూలీలకు పనిముట్లతో పాటు పని ప్రదేశం దగ్గర కనీస సౌకర్యాలు కల్పించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఈశ్వరయ్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. శనివారం మండలంలోని బలపాలపల్లె గ్రామ సమీపాన జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పనిముట్లు ఇవ్వకపోవడం బాధకరం అన్నారు. ప్రతి ఏడాది కూలీలకు పనిముట్లు ఇవ్వాలని చట్టంలో ఉన్నా అమలుచేయడం లేదన్నారు.

శ్రీమద్దిలేటిస్వామి ఆదాయం రూ.19,59,450



శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయం ఆవరణంలో భక్తుల సందడి

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్య క్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయం శనివారం భక్తజనంతో కిక్కిరిసిపోయింది. ఉమ్మడి కర్నూలు జిల్లాతోపాటు తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. వేకువ జామున ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానా లు ఆచరించి స్వామి, అమ్మవార్లకు అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన,మహా మంగళహారతి, వరపూజ నిర్వహించి మొక్కులు చెల్లించారు. సేవా టికెట్స్, లడ్డు ప్రసాదం, గదుల బుకింగ్,అన్నదానం చందాలు, గండాదీపం, విరాళాలు, కల్యాణ కట్ట తదితర సేవల ద్వారా రూ. రూ.19,59,450 ఆదా యం వచ్చినట్లు ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, ఆలయ చైర్మన్ సీతారామచంద్రుడు తెలిపారు.

వైభవంగా చెన్నకేశవస్వామి రథోత్సవం

బేతంచెర్ల: మండల పరిధిలోని యంబాయి గ్రామంలో వెలసిన చెన్న కేశవస్వామి ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీదేవి, భూదేవి సమేతుడైన చెన్న కేశవస్వామి రథోత్సవం శనివారంవైభవంగా జరిగింది.ప్రత్యేకంగా అలంకరించిన పూల రథంపై స్వామి, అమ్మవార్లను కొలువుంచి ఊరేగింపు చేశారు. భక్తులు స్వామి,అమ్మవార్లనుదర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

శేషవాహనంపై ఊరేగిన పాండురంగడు



శేషవాహనంపై దర్శనమిస్తున్న పాండురంగడు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారు శేషవాహనంపై ఊరేగితూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యులు పంచామృతాభిషేకం, మహాగణపతి పూజ, స్త్రీసూక్త, భూసూక్త విధానేన అభిషేకాలు, సంప్రోక్షణ, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రికి పాండురంగడు శేష వాహనంపై కొలువుదీరగా పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయం నుంచి గాంధీసెంటర్ వరకు గ్రామోత్సవం కొనసాగింది. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పాండురంగ విఠలేశ్వరుడు గరుడవాహనంపై భక్తులకు దర్శన మిస్తారని ఆలయ ధర్మకర్త రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

ఎండుమిర్చికి లభించని గిట్టుబాటు ధర



కల్లంలో నిల్వలుగా ఉన్న ఎండుమిర్చి

బనగానపల్లె: పదిరోజులుగా కురుస్తున్న వర్షాల మూలంగా హైబ్రిడ్ రకాలకు చెందిన ఎండుమిర్చిలో తేమశాతం ఎక్కువైంది. దీంతో మిర్చి యార్డులో గిట్టుబాటు ధర లభించడంలేదని మిర్చి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో సూపర్-10, తేజా, యూ 5341 డిలక్స్ రకాలను రైతులు 17.891 ఎకరాల్లో సాగు చేశారు. బనగానపల్లె మండలంలో 3706, కోవెలకుంట్ల మండలంలో 3914, కొలిమిగుండ్ల మండలంలో 1475, అవుకు మండలంలో 3408, సంజామల మండలంలో 5388 ఎకరాల్లో ఈ పంటను సాగు చేశారు. వర్షాలు వచ్చే సమయానికి సుమారు 60-70 శాతం మిరప పంటను రైతులు గుంటూరు మిర్చి యార్డుకు తరలించి క్వింటాం రూ.24-25వేల వరకు విక్రయించారు. ఈ ధర గిట్టుబాటుగా ఉందని రైతులు పేర్కొంటున్నారు. అయితే గత పదిరోజులుగా ఎడతెరపిలేని వర్షాలు కురుస్తున్నందున కల్లాల్లో మిగిలి ఉన్న మిరప పంట రైతులు టార్పాలిన్ పట్టాలతో కప్పి కాపాడుకుంటున్నారు. అయితే మిర్చిలో తేమ శాతం ఎక్కువ కావడంతో యార్డులో క్వింటాంకు రూ.17వేలకు మించి గిట్టుబాటు ధరలభించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి



ఇటిక్యాల లేఅవుట్‌లో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

కొలిమిగుండ్ల: నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలను లబ్దిదారులు త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ దోనీ అల్‌ఫ్రెడ్, ఎంపీడీఓ సుబ్బరాజు సూచించారు. హౌసింగ్‌డే కార్యక్రమంలో భా గంగా శనివారం ఇటిక్యాల, కనకాద్రిపల్లె లేఅవుట్లలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనుల ను వారు పరిశీలించారు. ఇటిక్యాల లేఅవుట్ లో 40 ఇళ్లు మంజూరుకాగా 25 బీపీఎల్ స్టేజ్ లో ఉన్నాయన్నారు.మిగిలిన 15 మంది లబ్ధి దారులు త్వరలోనే నిర్మాణాలు మొదలు పెడుతారని చెప్పారు. కాలనీలో ఇప్పటికే బోరు ఏర్పాటు చేసి చేతి పంపు అమర్చామని, సోమ వారం మోటార్ అమర్చుతామని తెఇపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం, హౌసింగ్ ఏఈ మద్దిలేటి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

సంజామల(కోవెలకుంట్ల): పక్కాగృహాల నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ నాగకుమార్ తెలిపారు. హౌసింగ్ డేను పురష్కరించుకుని శనివారం సంజామల మండలంలోని ఆకుమల్ల గ్రామ శివారులోని జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ బాలచంద్రుడు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఉమాకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పది' ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులు

- కోవెలకుంట్ల ఉర్దూ ఉన్నత పాఠశాలో వందశాతం ఉత్తీర్ణత
- గురుకుల పాఠశాలలో 88.5 శాతం ఫలితాలు

కోవెలకుంట్ల: 2022-23 విద్యా సంవత్సర పదవ తరగతి పరీక్షా ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. పట్టణంలోని ఉర్దూ ఉన్నత పాఠశాల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో తెలుగు, ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు 61.1 శాతం ఉత్తీర్ణత సాధించారు. పట్టణ శివారులోని గురుకుల పాఠశాల విద్యార్థులు 88.5 శాతం ఉత్తీర్ణత పొందినట్లు ప్రిన్సిపాల్ ఫిర్దౌస్ అంజుమ్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు సంబంధించి 36.5 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని గుళ్లదూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 50 శాతం, రేవనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 56.7 శాతం, భీమునిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 78.3 శాతం ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థులకు హెచ్ఎంలు రామిరెడ్డి, రామచంద్రారెడ్డి, కేవీ సుబ్బారెడ్డి అభినందనలు తెలిపారు.

అవుకు మండలంలో 57.34శాతం ఉత్తీర్ణత

అవుకు: అవుకు మండలంలో పదవ తరగతి పరీక్షల్లో 57.34 శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ శ్రీధర్ రావు శనివారం తెలిపారు. మొత్తం 497 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయగా 285 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. మదర్ మోడల్ స్కూల్ 96.15 శాతం, మంగంపేట పాఠశాల 90శాతం, ఆదర్శ పాఠశాల 70.93శాతం, సుంకేసుల పాఠశాల 68.75 శాతం, సెయింట్ మేరీస్ స్కూల్ 66.66 శాతం, కునుకుంట్ల పాఠశాల 57.69 శాతం, అవుకు బాలికల పాఠశాల 55.76 శాతం, సంగపట్నం పాఠశాల54.16 శాతం, కేజీబీవి పాఠశాల 52.38 శాతం, గుండ్లశింగవరం పాఠశాల 47.22 శాతం, అవుకు బాలుర పాఠశాల 46.15 శాతం, రామాపురం పాఠశాల 36.11 శాతం, చెన్నంపల్లె పాఠశాల 28శాతం, ఉప్పలపాడు పాఠశాల విద్యార్థులు 11.11శాతం ఉత్తీర్ణతలు సాధించారని ఎంఈఓ వివరించారు.

బనగానపల్లెరూరల్: మండలంలో శనివారం విడుదల చేసిన పదవ తరగతి ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు 44 శాతం సాధించిన్నట్లు ఎంఈఓ స్వరూప తెలిపారు. 12 ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు కస్తూర్బా, ఏపీ మోడల్ స్కూల్, మహాత్మాజ్యోతి రావు పూలే పాఠశాలల్లో మొత్తం 970 మంది విద్యార్థిని విద్యార్థులు పది పరీక్షలకు హాజరయ్యారు. 426 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి 44 శాతం మంది పాస్ అయిన్నట్లు తెలిపారు. ప్రవేట్ పాఠశాల్లో మొత్తం 1322 మంది పరీక్షలకు హాజరుకాగా 776 మంది ఉత్తీర్ణతతో 56శాతం పాస్ అయినట్లు ఎంఈఓ తెలిపారు.

70 శాతం ఉత్తీర్ణత సాధించిన మోడల్ స్కూల్ విద్యార్థులు

కొలిమిగుండ్ల: పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో మోడల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. 70 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ చంద్రసేనారెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి మొత్తం 456 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 144 మంది పాస్ కావడంతో 37 శాతం ఉత్తీర్ణత శాతం వచ్చింది.

సంజామల(కోవెలకుంట్ల): సంజామల మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. మండలంలోని ఎనిమిది జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కస్తూరిభాగాంధీ బాలికల విద్యాలయాల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియాల్లో 56.4 శాతం ఫలితాలు సాధించారు. పేరుసోముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 54.3 శాతం, నొస్సం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 49శాతం, సంజామల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు 70 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే మండల కేంద్రం సంజామల కస్తూర్బా బాలికల విద్యాలయం విద్యార్థినులు 67 శాతం ఉత్తీర్ణత సాధించారు.

ప్యాపిలి మండలంలో 51.55 శాతం ఉత్తీర్ణత

ప్యాపిలి: పదో తరగతి ఫలితాల్లో ప్యాపిలి మండలంలో 51.55 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 12 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, ప్రియా సిమెంట్, సరస్వతి శిశుమందిరంతో కలిపి మొత్తం 774 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 399 మంది ఉత్తీర్ణులయ్యారు. రాచర్ల ఉన్నత పాఠశాల 90 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

మోడల్ స్కూలు విద్యార్థుల ప్రతిభ

బేతంచెర్ల : పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 59.18 శాతం సాధించి ఏపీ మోడల్ స్కూలు విద్యార్థులు ప్రతిభ చాటారు. విద్యార్థులను మోడల్ స్కూలు ప్రిన్సిపాల్ షమీల, అధ్యాపకులు అభినందించారు. అలాగే పట్టణంలోని మెయిన్ జెడ్పీ హైస్కూలు విద్యార్థులకు హెచ్ఎం హరి కృష్ణ అభినందనలు తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి 959 మంది పరీక్షలు రాయగా 388 మంది ఉత్తీర్ణులైనట్లు ఎంఈఓ సోమశేఖర్ తెలిపారు. మండల వ్యాప్తంగా 40.4 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ తెలిపారు.

డోన్ టౌన్ : పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో మోడల్ స్కూల్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటుకున్నారు.మోడల్ స్కూల్ విద్యార్థులు 77మందిఉత్తీర్ణత సాధించారు.అదేవిధంగా గురుకుల పాఠశాల విద్యార్థులు మంచి మార్కులు సాధించారు.

పది ఫలితాల్లో ప్రైవేట్ విద్యా సంస్థల హవా

డోన్ టౌన్: పదవ తరగతి ఫరీక్ష ఫలితాల్లో పట్టణంలోని ప్రైవేట్ విద్యా సంస్థల విద్యార్థులు హవా చాటుకున్నారు. మంచి మార్కులు సాధించిన శ్రీసుధ హైస్కూల్ విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

కోవెలకుంట్ల: పదవ తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో పట్టణానికి చెందిన ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. విద్యార్థులకు హెచ్ఎం వినోద్ కుమార్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. అలాగే చిదానంద, ప్రగతి హైస్కూల్ హెచ్ఎంలు గురుస్వామి, గపూర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించారు.

వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు



దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న ఐటీఅండ్‌సీ శాఖ కార్యదర్శి కోనశశిధర్, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

బండిఆత్మకూరు: ప్రభుత్వం వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చినట్లు ఐటీఅండ్‌సీ శాఖ కార్యదర్శి కోనశశిధర్, కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తెలిపారు. శనివారం నారాయణాపురం గ్రామంలో దెబ్బతిన్న వరిపంటను వారు పరిశీలించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో రబీలో సాగుచేసిన వరిపంట నేలమట్టం అయ్యింది. దీంతో రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న కోనశశిధర్, కలెక్టర్‌లు స్వయంగా గ్రామంలో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించటంతో పాటు నష్టపోయిన రైతుల వివరాలు సేకరించారు. ప్రతి గ్రామంలో ఎన్ని హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయో, రైతులకు ఎంతనష్టం వాటిల్లిందో వ్యవసాయ అధికారులు లెక్కించి సమగ్ర వివరాలు పంపించాలని ఆదేశించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా దళారుల ప్రమేయం లేకుండా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి రైతుల నుంచి గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నంద్యాల, ఆత్మకూరు ఆర్డీఓలు శ్రీనివాసులు, ఎం దాసు, తహసీల్దార్ ఉమారాణి, ఆర్ఐ సుప్రియ, వీఆర్వో ఏసుపాదం, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య



కామేశ్వరి (ఫైల్)

ప్యాపిలి: పదో తరగతి ఫలితాల్లో ఫెయిల్ కావడంతో మనస్థాపానికి గురైన ఓ విద్యార్థిని ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మండల పరిధిలోని పోతుదొడ్డి గ్రామానికి చెందిన రామాంజనేయులు, నాగేంద్రమ్మల కుమార్తె కామేశ్వరి(15) స్థానిక కేజీబీవీలో పదో తరగతి చదువుతోంది. శనివారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో కామేశ్వరికి గణితంలో 26 మార్కులు రావడంతో ఫెయిల్ అయింది. దీంతో ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందింది. విద్యార్థిని తల్లి నాగేంద్రమ్మ కొన్ని సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మరణించింది.

చెల్లెలుపై అన్న దాడి

కోవెలకుంట్ల: మండలంలోని అమడాల గ్రామంలో సొంత చెల్లెలుపై అన్న దాడి చేసిన సంఘటన చోటు చేసుకుంది. శనివారం ఎస్ఐ వెంకటరెడ్డి అందించిన సమాచారం మేరకు ఆస్తి తగాదాలో గ్రామానికి చెందిన రమాదేవిపై అన్న శ్రీనివాసులు దాడి చేసి గాయపరిచాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహ స్వామి ఆలయం సమీపాన శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. నందికొట్కూర్ మండలం, మండ్లెం గ్రామానికి చెందిన శివ ప్రసాద్ మద్దిలేటి స్వామి దర్శనార్థం ద్విచక్రవాహనంపై వచ్చాడు. స్వామివారి దర్శనం అనంతరం ద్విచక్రవాహనంపై వెళ్తూ ప్రమాదవశాత్తు రహదారి ప్రక్కన్న ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. వర ప్రసాద్‌కు తీవ్రగాయాలు కావడంతో బేతంచెర్ల సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం లైఫ్ అంబులెన్సులో కర్నూలుకు తరలిస్తుండగా మార్గ మధ్యలో వరప్రసాద్(35) మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు దుకాణాల్లో చోరీ

డోన్ టౌన్: పట్టణంలోని పాతబస్టాండ్ ప్రాంతంలో శుక్రవారం రాత్రి రెండు దుకాణాల్లో చోరీ జరిగింది. శనివారం ఉదయం దుకాణం యజమానులు వెళ్లి చూడగా తలుపులకు ఉన్న తాళాలు పగళ గొట్టి ఉండడాన్ని గమనించారు. దానప్రియ సెల్ పాయింట్‌లో మూడు కీ ప్యాడ్ సెల్‌పోన్లు, రూ. 6వేల నగదు చోరీకి గురికాగా గాంధీ విగ్రహం సమీపంలోని చంద్రన్న అనే చర్మకారుడి చెప్పుల దుకాణంలో రూ.7500 విలువ చెప్పులు ఇతర సామగ్రి చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. విషయాన్ని బాధితులు పట్టణ పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా సీసీ కెమరాలను పరిశీలించి నిందితులను గుర్తించే చర్యలు చేపట్టారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం

సంజామల(కోవెలకుంట్ల): సంజామల మండలం కమలపురి సమీపంలోని పాలేరువాగులో నాలుగు రోజుల క్రితం గల్లంతైన వృద్ధుడి మృతదేహం శనివారం లభ్యమైంది. ఎస్ఐ ప్రతాప్ అందించిన సమాచారం మేరకు ఇదే మండలం హోత్రమాన్‌దిన్నె గ్రామానికి చెందిన తలారి కంబగిరి(76) గత బుధవారం రాత్రి పాలేరు వాగులో గల్లంతయ్యాడు. ఏపీ ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది ఆధ్వర్యంలో వాగు వెంట గాలింపు చర్యలు చేపట్టి బొందలదిన్నె సమీపంలో మృతదేహాన్ని గుర్తించారు. శవ పరీక్ష నిమిత్తం మృతదేహాన్ని కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

రుద్రవరం: మండల కేంద్రానికి చెందిన హేమలత అనే వివాహిత ఫిర్యాదు మేరకు ఏడుగురిపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ భూపాల్‌రెడ్డి శనివారం తెలిపారు. వివరాలు.. బాధితురాలికు పదేళ్ల క్రితం మాచినేనిపల్లె గ్రామానికి చెందిన సురేష్‌తో వివాహమైంది. వారికి ఇద్దరు సంతానం. కొద్ది రోజులుగా కుటుంబ సభ్యులు అదనపు కట్నం తీసుకురావాలని వేధించసాగారు. వారి బాధ తాళలేక బాధితురాలు పుట్టింటికి చేరుకొని తల్లిదండ్రుల ద్వారా పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. దీంతో భర్త సురేష్‌తో పాటు అత్త శ్యామల, మామ లక్ష్మయ్య, ఆడపడులు కళ్యాణి, సువర్ణ, వారి భర్తలు కృష్ణ, శ్రీనివాసులుపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.